VIGNAN PATRIKA
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)
APTEL/2024/89102
ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293
సంపుటి : 02 సంచిక : 56 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శుక్రవారం 27 మార్చి 2026 పేజీలు : 04 వెల : 02

# రాష్ట్ర రాజధానిగా అమరావతి ఖరారు చేస్తూ తీర్మానం

- అమరావతిలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశం
- అమరావతికి చట్టబద్ధతపై తీర్మానం చేసి కేంద్రానికి పంపేందుకే
- భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే విభజన చట్టానికి సవరణ
- రాజధాని నిర్మాణ పురోగతి పై కేంద్రానికి నివేదిక
- అమరావతికి చట్టబద్ధతపై కీలక నిర్ణయం
- ఆస్తి పన్ను వడ్డీ మాఫీతో ప్రజలకు ఊరట
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త కోర్టులకు గ్రీన్ సిగ్నల్
- పరిశ్రమలు, విద్య, గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం



రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ తీర్మానం చేయడమే ప్రధాన ఎజెండాగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం సమావేశమైంది. రాజధానికి చట్టబద్ధత కల్పించేలా మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. దాదాపు 20కు పైగా అజెండా అంశాలకు ఇందులో ఆమోదం తెలపనున్నట్లు తెలుస్తోంది.

# నిద్రలోనే తెల్లారిన బతుకులు

**బస్సులోంచి బయటకొచ్చేలోపే ప్రాణాలు మసి**
**మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో ఘోర బస్సు ప్రమాదం**
**టిప్పర్‌ని ఢీకొని హరికృష్ణ ట్రావెల్స్ బస్సు అగ్నికి అహుతి**
**14 మంది సజీవదహనం, 27 మందికి గాయాలు**
**5 నెలల పసికందు! భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువతీ యువకులు!**

**చనిపోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుతవం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు పరిహారం**

కుటుంబానికి వెన్నెముకగా నిలిచే కష్టజీవులు! ఇలాంటి వారి కలలు తెల్లారేలోగా కడతేరాయి. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో రాత్రి నిద్రించిన ప్రయాణికులు అగ్నిప్రమాదానికి గురై శాశ్వత నిద్రలోకి జారుకున్నారు.



# చర్చలంటూనే దాడులు

- ★ బట్టబయలైన ట్రంప్ కుట్ర
- ★ ఇరాన్ నేవీ చీఫ్ మృతి
- ★ హోర్ముజ్ గుండా వెళ్లే నౌకలపై ఇరాన్ టోల్ ఫీజు
- ★ మిత్ర దేశాల నౌకలకు అనుమతి
- ★ సీరియస్‌గా ఆలోచించాలంటూ ట్రంప్ హెచ్చరికలు
- ★ నేవీ చీఫ్‌ను చంపేశాం : ఇజ్రాయిల్
- ★ ఇరాన్‌కు డ్రోన్లు ...వార్తలు అబద్ధం : రష్యా
- ★ పరోక్ష చర్చలు జరుగుతున్నాయన్న పాక్
- ★ చర్చల్లేవు.. అమెరికా ప్లాన్‌ను సమీక్షిస్తున్నామన్న ఇరాన్
- ★ ఇజ్రాయిల్ అణు స్థావరాలపై ఇరాన్ దాడులు
- ★ భారత్ సహా ఐదు దేశాలకు అనుమతి




ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, ఐదు రోజులపాటు దాడులను వాయుదా వేస్తున్నామంటూ ట్రంప్ చేసిన ప్రకటన కుట్రపూరితమని తెలిపోయింది. ఆ ప్రకటన అనంతరం కూడా ఇరాన్‌పై దాడులు కొనసాగాయి. ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో గురువారం ఆ దేశ నేవీ చీఫ్ అలీరేజా మృతి చెందారు. ఇరాన్ సెంట్రల్ సిటీ ఇష్ఫాన్ సహా ఇరాన్ వ్యాప్తంగా విస్తృతంగా దాడులు జరిపినట్టు ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. అనేక ప్రాంతాల్లో ఇరాన్ మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్టు మిలటరీ ప్రకటన వెలువడింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు రవాణాకు అత్యంత కీలకమైనదిగా భావించే హోర్ముజ్ జలసంధి మార్గంలో సాగే నౌకలకు టోల్ ఫీజు విధించే అంశంపై ఇరాన్ పార్లమెంట్ కసరత్తు చేస్తోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కి అత్యంత సన్నిహితమైన ది ఫార్స్, తస్నిమ్ వార్తా సంస్థలు ఈ మేరకు కథనాలు ఇచ్చాయి. "ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, నియంత్రణను, పర్యవేక్షణ ను అధికారికంగా ప్రకటించేందుకు ఒక ప్రణాళికను అనుసరించాలని ఇరాన్ పార్లమెంట్ భావిస్తోంది. అదే సమయంలో ఫీజు వసూలు చేయడం ద్వారా కొంతమేర ఆదాయం కూడా సృష్టించుకోవాలని యోచిస్తోంది." అని పార్లమెంట్ సభ్యుడు మహ్మద్‌రెజా కౌచిని ఉటంకిస్తూ ఈ వార్తా సంస్థలు తెలిపాయి. "ఇది చాలా సర్వసాధారణం, ఇతర కారిడార్ల గుండా సాగేటప్పుడు చెల్లించే రవాణా ఫీజు మాదిరిగానే ఇక్కడ కూడా చెల్లించాల్సి ఉంటుంది.

# ఏఐ యుగానికి అనుగుణంగా చైనా తరగతులు

**భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సిద్ధం**
**కొత్త నైపుణ్యాల వైపు ఆ దేశ విద్యా వ్యవస్థ**
**భారత్‌లో ఇంకా మార్కులు, ర్యాంకుల ఆధిపత్యమే**
**అవే విద్యార్థుల ప్రతిభకు కొలమానం**
**ఈ విధానంలో మార్పు రావాలి : మేధావులు, నిపుణులు**

కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచంలో ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. ప్రతీ రంగాన్నీ ప్రభావితం చేస్తోంది. ప్రస్తుతం నడుస్తున్నది ఏఐ యుగమేనంటూ నిపుణులు చెప్తున్నారు. అయితే చైనా ఏఐ యుగానికి సరిపోయేలా తమ విద్యావ్యవస్థను తయారు చేసుకుంటోంది. సమస్యలు పరిష్కరించే నైపుణ్యాల వైపు తీసుకెళ్తోంది.




# ఢిల్లీ మెట్రో స్టేషన్‌లో పేలుడు..

బెంబేలెత్తిపోయిన ప్రయాణికులు
తప్పిన పెను ప్రమాదం
ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడి
జాఫ్రాబాద్ మెట్రో స్టేషన్ కీలకం



# రాహుల్ గాంధీ మైండ్ హైజాక్

పార్లమెంటుకు టీ షర్ట్‌లో రావడమేంటి : రిజిజు
సోమ్‌నాథ్ స్పీకర్ అయ్యాక డ్రెస్సింగ్‌ను మార్చేశారు
రాహుల్ విపక్ష నేత అయినా టీ షర్ట్‌లోనే సభకు వస్తున్నారు
కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విమర్శలు
సోమ్‌నాథ్ స్పీకర్ అయ్యాక డ్రెస్సింగ్‌ను మార్చేశారు
అడ్వైజర్లు చెప్పినవన్నీ రాహుల్ మాట్లాడుతున్నారు
అఖిలపక్ష భేటీలో విపక్షాలు పరిపక్వతను చూపాయి



# రెండింటికీ నిధుల కోత ప్రసక్తే లేదు

వాటికి అవసరమైన ఫండ్ కేటాయిస్తాం
విద్య, వైద్య రంగాలపై సీఎం రేవంత్‌రెడ్డి
ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ల సేవలను వినియోగించుకుంటాం
అందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్
బోధనాస్పత్రుల్లో పని చేసే వైద్యులకు ప్రోత్సాహకాలు
పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించటమే ధ్యేయం
అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ముఖ్యమంత్రి సమాధానం

విద్య, వైద్య రంగాలకు కేటాయించే నిధుల్లో కోత విధించే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాటికి చాలినంత ఫండ్ కేటాయిస్తామని ఆయన తెలిపారు. తెలంగాణలో వైద్య విద్యనభ్యసించి విదేశాల్లో స్థిరపడిన ప్రముఖ వైద్యులు... ఇక్కడకు వచ్చినప్పుడు ప్రభుత్వ దవాఖానాలు, బోధనాసుపత్రుల్లో వారి సేవలను వినియోగిం చుకునేలా ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు.



# రాష్ట్ర రాజధానిగా అమరావతి ఖరారు చేస్తూ తీర్మానం

నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 60 మీటర్ల ఎత్తు వరకు అకాడమిక్ భవనాల నిర్మాణంపై కేబినెట్?లో చర్చించనున్నారు. రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటు 1,730 ఉద్యోగాల సృష్టికి మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముంది. వడ్డెర సంఘాలకు ప్రాధాన్య క్రమంలో ఖనిజ లీజుల కేటాయింపులు ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50 శాతం రాయితీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్స్, రికార్డు అసిస్టెంట్ పోస్టుల మంజూరుకు మంత్రివర్గం ఆమోదించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసింది. జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునీకరణ, మరమ్మతులకు అనుమతులు ఇవ్వనుంది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించేందుకు అవసరమైన లాంఛనాలకు సచివాలయంలో జరుగుతున్న మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపనున్నారు. ఎల్లుండి జరిగే ప్రత్యేక శాసనసభ (అసెంబ్లీ) సమావేశంలో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించనున్నారు. శాసనసభలో ఆమోదించిన తీర్మానాన్ని కేంద్ర హోంశాఖకు పంపనున్నారు.

**రాజధాని నిర్మాణ పురోగతి పై కేంద్రానికి నివేదిక :** 2016లోనే అమరావతి కేంద్రంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం పరిపాలన ప్రారంభించినప్పటికీ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ 10 ఏళ్లు ఉంటుంది అని విభజన చట్టంలో పేర్కొంది. దీంతో సాంకేతికంగా అమరావతికి చట్టబద్ధత కల్పించలేదు. ఆ గడువు ముగియడంతో అమరావతిని రాజధానిగా ప్రకటించాలని, చట్టబద్ధత కల్పించాలని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాజధానిగా అమరావతిని ఎంపిక చేసిన విధానం, చారిత్రక నేపథ్యం, 2016 నుంచి అమరావతి కేంద్రంగానే రాష్ట్ర పరిపాలన సాగుతుండటం, రాజధాని నిర్మాణ పురోగతి వంటి అంశాలపై కేంద్రానికి నివేదిక సమర్పించారు. 2024 జూన్ 2న ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో ఆరోజు నుంచే అమరావతిని రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. సానుకూలంగా స్పందించిన కేంద్ర హోంశాఖ ముసాయిదా కేబినెట్ నోట్‌ని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి, న్యాయశాఖలతో పాటు నీతి ఆయోగ్‌కి పంపి అభిప్రాయాలు కోరింది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశ పెట్టేందుకు అవసరమైన లాంఛనాలు అన్నీ శరవేగంగా పూర్తి చేస్తోంది. అసెంబ్లీ ప్రత్యేక సమావేశం : బుధవారం కేంద్ర మంత్రివర్గ భేటీలో అమరావతికి చట్టబద్ధత అంశాన్ని టేబుల్ ఐటెంగా తీసుకుని ఆమోదం తెలపాలని కోరగా, వెంటనే బిల్లు ప్రవేశ పెట్టాలని కేంద్రం భావించింది. ఇందుకుగానూ అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ గతంలో అధికారికంగా తీసుకున్న నిర్ణయం వివరాలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సీఎంవో, అసెంబ్లీ నుంచి అధికారులు ఆ వివరాలు అన్నింటిని పరిశీలించారు. కానీ కేంద్రం కోరినటువంటి రూపంలో ఆ వివరాలు లేవని గుర్తించారు. ఆ విషయాన్ని పీఎంఓకి తెలియజేశారు. అయితే తాజాగా శాసనసభలో తీర్మానం చేసి పంపించాలని కేంద్రం సూచించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల పై అసెంబ్లీని సమావేశమైంది. అమరావతికి భవిష్యత్తులోను కూడా ఏ విధమైన న్యాయపరమైన చిక్కులేవీ తలెత్తకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర రాజధానిగా అమరావతి చిరస్థాయిగా కొనసాగేలా, భవిష్యత్‌లో ఎవరూ కదిపేందుకు వీలు లేని విధంగా చట్ట సవరణ చేయనున్నారు. అమరావతికి రాజధానిగా కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పిస్తే భవిష్యత్తులో రాజధానిని ఇక్కడి నుంచి తరలించడం దాదాపు అసాధ్యం.

# నిద్రలోనే తెల్లారిన బతుకులు

మార్కాపురం జిల్లాలో ట్రావెల్స్ బస్సు, టిప్పర్ ఢీకొని 14 మంది సజీవదహనం అయ్యారు. 27 మంది రకరకాల గాయాలతో బయట పడ్డారు. సాఫీగా సాగుతున్న ప్రయాణం! బస్సులో హాయిగా నిద్రిస్తున్న ప్రయాణికులు ! సడెన్‌గా పెద్ద శబ్దం! ఏం జరిగిందే గ్రహించేలోపే అగ్నికీలలలు చుట్టుముట్టాయి! గాఢనిద్ర నుంచి మేల్కొనే లోపే బస్సంతా వ్యాపించాయి! బస్సు డ్రైవర్, క్లీనర్ గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదానికి ముందురోజు అంటే బుధవారం సాయంత్రం ఐదున్నరకు హరికృష్ణ ట్రావెల్స్ బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరి బయల్దేరింది. గురువారం ఉదయం ఐదున్నర ఆరు గంటల మధ్య మార్కాపురం మండలం రాయవరం సమీపంలోని పలకల క్వారీల వద్దకు చేరుకుంది. ఆ సమయంలో చీమకుర్తి నుంచి మార్కాపురం వైపు కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ని ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జవగా టిప్పర్ రోడ్డుకు అడ్డంగా పడింది. 2 వాహనాల్లోని ఇంధనం లీకైంది. అగ్గి రాజుకుంది. క్షణాల్లో మంటలు వ్యాపించాయి. పెద్దఎత్తున ఎగసిపడ్డాయి. స్లీపర్ కమ్ సీటింగ్ బస్సు కావడంతో పైనున్న వారు కిందకి దిగలేకపోయారు. కొంతమంది అద్దాలు పగలగొట్టుకుని బయటకు దూకేయగా అలా చేయడానికి వీలుపడనివాళ్లు మంటల్లో సజీవదహనం అయ్యారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకునేలోపే బస్సు పూర్తిగా దగ్ధమైంది. కొందరి శరీరాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. మాంసపు ముద్దలే మిగిలాయి. మృతదేహాలను బస్సు నుంచి ఒక్కొక్కటిగా పోలీసులు బయటకు తీశారు. మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీఎన్?ఏ టెస్టుల ఆధారంగా బంధువులకు వాటిని అప్పగించనున్నారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 41 మంది ఉన్నారు. మృతులను అంబటి అనిల్, లియో, బండారి పద్మ, ముత్తంగి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి పిచ్చమ్మ, రుక్మిణి, ఉప్పు రమాదేవి, పొదిలి మహేంద్ర, ప్రభావతి, కత్తి జయరాములు, ఆత్మకోరు చిన్న, దేవేంద్ర రామయ్య, చైత్ర, జ్యోతిగా గుర్తించారు. బస్సు కండిషన్ సరిగా లేదని డ్రైవర్‌తో ప్రయాణికులు ముందుగానే చెప్పినట్లు తెలిసింది. మార్గం మధ్యలో యర్రగొండపాలెం వద్ద గంటసేపు నిలిపివేసి డ్రైవర్, క్లీనర్ మరమ్మతులు కూడా చేశారు. ఆ తర్వాత దాదాపు గంట సేపటికే బస్సు ప్రమాదానికి గురైంది. స్టీరింగ్ స్ట్రక్ అవడం వల్లే ప్రమాదమని బస్సు డ్రైవర్ చెప్పినట్లు తెలుస్తోంది.

**బాధిత కుటుంబాలకు పరిహారం:** ఈ బస్సు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత?వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు పరిహారం ప్రకటించింది. గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు, కేంద్రం రూ.50 వేలు సాయం చేస్తామని తెలిపింది. బస్సులో ప్రయాణికులు సజీవదహనమవడం అత్యంత విషాదకరమంటూ ఎక్స్ వేదికగా ప్రధాని ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుర్ఘటనపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఘటనపై సీఎం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. హుటాహుటిన హోంమంత్రి అనిత, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ఘటనా స్థలికి పంపారు. అక్కడికి చేరుకున్న వారు ప్రమాదానికి గురైన బస్సును పరిశీలించారు. అధికారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఏంచేయాలనేది నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# రాహుల్ గాంధీ మైండ్ హైజాక్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మైండ్‌ను ఆయన సలహాదారులు హైజాక్ చేశారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. ఆ సలహాదారులు చెప్పిందే పార్లమెంటులో రాహుల్ మాట్లాడుతుంటారని ఆయన పేర్కొన్నారు. రాహుల్‌కు డ్రెస్సింగ్ సెన్స్ లేదని, లోక్‌సభ విపక్ష నేత హోదాకు తగిన డ్రెస్‌తో పార్లమెంటుకు హుందాగా వస్తే బాగుంటుందని రిజిజు సూచించారు. టీ షర్ట్‌పై తనకు అభ్యంతరం లేదని, కానీ విపక్ష నేత హోదాలో ఉన్న వ్యక్తి దాన్ని ధరించి లోక్‌సభకు రావడమే సబబుగా అనిపించడం లేదన్నారు. గురువారం రోజు ఓ మీడియా సంస్థ నిర్వహించిన సదస్సు వేదికగా కిరణ్ రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు.

**సోమ్‌నాథ్ స్పీకర్ అయ్యాక డ్రెస్సింగ్‌ను మార్చేశారు**

"లోక్‌సభ స్పీకర్ కావడానికి ముందు సీనియర్ కమ్యూనిస్టు నేత సోమ్‌నాథ్ ఛటర్జీ ఒక లూజ్ షర్ట్, సాధారణ చెప్పులతో సభకు వచ్చేవారు. కానీ లోక్‌సభ స్పీకర్ అయ్యాక, ఆ హోదాకు తగిన డీసెంట్ డ్రెస్‌తో సభకు సోమ్‌నాథ్ వచ్చారు. అందుకే స్పీకర్ కుర్చీలో ఆయన హుందాగా కనిపించేవారు. ఇక ఇదే సమయంలో రాహుల్ గాంధీ విపక్ష నేతగా ఎన్నికైనా టీ షర్ట్‌లోనే లోక్‌సభకు వస్తున్నారు. ఈవిధమైన డ్రెస్సింగ్ అనేది ఆ హోదాలో ఉన్నవారికి కరెక్టు కాదు. నేను రాహుల్ గాంధీని గౌరవించకపోవచ్చు. కానీ ఆయన హోదాను గౌరవించాల్సి ఉంటుంది. అందుకే రాహుల్ గాంధీ కాస్త మంచి డ్రెస్సింగ్ సెన్స్‌తో వ్యవహరించాలని చాలామంది భావిస్తుంటారు" అని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

**అడ్వైజర్లు చెప్పినవన్నీ రాహుల్ మాట్లాడుతున్నారు**

"కేంద్ర ప్రభుత్వం సాధించే ప్రతీ విజయాన్ని, ఘనతను ప్రశ్నించడాన్ని రాహుల్ గాంధీ పనిగా పెట్టుకున్నారు. లోక్‌సభలో మాట్లాడేటప్పుడు ఆయన నియమ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఈ రూల్స్‌ను పాటించడం చాలా అవసరం. కానీ రాహుల్ గాంధీ ఆయన అడ్వైజర్లు చెప్పినవన్నీ మాట్లాడుతున్నారు. అంతకుముందు బీజేపీ విపక్షంలో ఉన్నప్పుడు ఇలా వ్యవహరించలేదు. మా పార్టీ విపక్ష హోదాలోనూ రూల్స్‌ను పాటించింది. లిమిట్స్‌ను ఎన్నడూ క్రాస్ చేయలేదు. ప్రధాని మోదీ పేదల కోసం పని చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను పెంచుతున్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు చేయడం ముఖ్యమే, కానీ విశ్వసనీయత అనేది అంతకంటే ముఖ్యమైంది" అని కేంద్ర మంత్రి చెప్పారు.

**అఖిలపక్ష భేటీలో విపక్షాలు పరిపక్వతను చూపాయి**

"ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధం జరుగుతున్న వేళ మా ప్రభుత్వం భారతదేశ ప్రయోజనాలు, ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు ప్రాధాన్యతను ఇస్తోంది. బహిరంగంగా భారతదేశ అధికార, విపక్షాల మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. కానీ పశ్చిమాసియా యుద్ధంపై బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీలు అత్యంత పరిపక్వతతో వ్యవహరించాయి. విపక్ష నేతలు వ్యక్తం చేసిన పలు ఆందోళనలకు, ప్రభుత్వం సమాధానాలను ఇచ్చింది. సవాళ్లతో కూడిన ఈ పరిస్థితుల్లో దేశం కోసం ఐక్యంగా నిలవాలని అధికార, విపక్షాలు నిర్ణయించాయి. టీఎంసీ మినహా అన్ని పార్టీలు అఖిలపక్ష భేటీకి హాజరయ్యాయి. కీలకమైన ఈ సమావేశానికి టీఎంసీ హాజరుకాకపోవడం విచారకరం. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లోనూ భారత్ స్థిరంగా, గౌరవప్రదంగా, సన్నద్ధంగా ఉంది. పశ్చిమాసియాలోని అన్ని దేశాలతోనూ భారత్ సత్సంబంధాలను కలిగి ఉంది. భారత్ స్వతంత్రంగా, స్వేచ్ఛగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోంది. దేశం కోసం అవసరమైన అన్ని నిర్ణయాలను ఎప్పటికప్పుడు తీసుకుంటోంది. ప్రతిపక్షాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి అనేది మా ప్రభుత్వం ఉద్దేశం. మా ప్రభుత్వానికి ఎల్లప్పుడూ దేశమే ఫస్ట్. దేశ ప్రయోజనాలే మాకు పరమావధి" అని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

# చర్చలంటూనే దాడులు

హోర్ముజ్ జలసంధి కూడా ఒక కారిడారే." అని ఆ ఎంపీ వ్యాఖ్యానించారు. ఆ మార్గానికి భద్రతను మేం కల్పిస్తున్నపుడు నౌకలు, చమురు ట్యాంకర్లు అటువంటి ఫీజులు చెల్లించడం కూడా సాధారణమేనని ఆయన వ్యాఖ్యానించారు.

**నేవీ చీఫ్‌ను చంపేశాం : ఇజ్రాయిల్**

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ నావికాదళ కమాండర్ అలీరెజా తంగ్సిరిని హత్య చేశామని ఇజ్రాయిల్ ప్రకటించింది. గతరాత్రి జరిగిన వైమానిక దాడుల్లో తంగ్సిరితో సహా ఇతర సీనియర్ నావికా కమాండర్లు మరణించినట్లు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ తెలిపారు. కాగా ఈ వార్తను ఇరాన్ వెంటనే ధ్రువీకరించలేదు.

**ఇరాన్‌కు డ్రోన్లు ...వార్తలు అబద్ధం : రష్యా**

ఇరాన్‌కు రష్యా డ్రోన్లు పంపుతోందంటూ వచ్చిన వార్తలను క్రెమ్లిన్ ఖండించింది. ఫైనాన్షియల్ టైమ్స్‌లో వచ్చిన ఆ వార్తలు అసత్యాలని పేర్కొంది. "మీడియాలో అనేక అబద్ధాలు ప్రచారమవుతున్నాయి. వాటిపై దృష్టి పెట్టకండి." అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కొవ్ విలేకర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. టెహ్రాన్‌కు డ్రోన్లు పంపించే క్రమంలో రష్యా ఉందని, మార్చి నెలాఖరు నాటికి అది పూర్తవుతుందని పశ్చిమ దేశాల ఇంటెలిజెన్స్ అధికారులను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది.

**పరోక్ష చర్చలు జరుగుతున్నాయన్న పాక్**

యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ ధృవీకరించారు. ఈ 'శాంతి చర్చలు' గురించి వస్తున్న వదంతులన్నీ అనవసరమైనవని ఆయన వ్యాఖ్యానించారు. పాక్ మధ్యవర్తిత్వంతో ఈ చర్చల ప్రక్రియ సాగుతోందని తెలిపారు. టర్కీ, ఈజిప్ట్ వంటి దేశాలు ఇందుకు మద్దతునిస్తున్నాయన్నారు. చర్చల్లేవు.. అమెరికా ప్లాన్‌ను సమీక్షిస్తున్నామన్న ఇరాన్ అమెరికాతో చర్చలు లేదా సంప్రదింపులు జరగడం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి స్పష్టం చేశారు. అయితే మధ్యవర్తుల ద్వారా పలు సందేశాల మార్పిడి జరుగుతోందన్నారు. ఇరాన్ ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని మమ్మల్ని వేడుకుంటోందని ట్రంప్ ప్రచారం చేసుకుంటుండగా అరగ్చి వాటిని కొట్టేపారేశారు. అందుకు భిన్నంగా అమెరికా ప్రతిపాదనను సమీక్షిస్తున్నామని మాత్రమే చెప్పారు. ప్రస్తుతానికి చర్చలు జరిపే ఆలోచన లేదన్నారు. 'మా వైఖరులను తెలియజేయడం లేదా అవసరమైన మేరకు హెచ్చరికలు జారీ చేసే సందేశాలే మధ్యవర్తుల ద్వారా సాగుతున్నాయని, వాటిని చర్చలు అని పిలవరాదని ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు.

**ఇజ్రాయిల్ అణు స్థావరాలపై ఇరాన్ దాడులు**

ఇజ్రాయిల్ కమాండ్‌కు చెందిన సైనిక నియంత్రణ కేంద్రంపై క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తెలిపింది. దానితో పాటు ఇజ్రాయిల్, జోర్డాన్ సరిహద్దులోని డెడ్ సీకి దక్షిణాన ఉన్న ఇజ్రాయిల్ అణు మౌలిక సదుపాయాలకు చెందిన పరిశ్రమలపై కూడా దాడి జరిగింది. ఇరాన్ వైపు నుంచి అనేక విడతలుగా క్షిపణి దాడులు జరిగాయని ఇజ్రాయిల్ సైన్యం తెలియజేసింది. సెంట్రల్ ఇజ్రాయిల్‌లోని కఫర్ ఖసింలో ఇరాన్ క్షిపణి పడి ఐదుగురు గాయపడ్డారు. భారీగా ఆస్తి నష్టం జరిగింది. దాడిలో అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. కాగా ఇరాన్ యుద్ధంలో చేరేందుకు హౌతీలు సిద్ధమయ్యారని ఇరాన్ మీడియాలో వార్తలు వచ్చాయి. గల్ఫ్ దేశాలపై కూడా ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్ వైపు నుంచి దూసుకొస్తున్న క్షిపణులను అడ్డుకునేందుకు యూఏఈ, కువైట్ వంటి దేశాలు ఆపసోపాలు పడుతున్నాయి. క్షిపణులను అడ్డుకునే క్రమంలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి.

**భారత్ సహా ఐదు దేశాలకు అనుమతి**

భారత్, చైనా, రష్యా సహా ఐదు మిత్ర దేశాల నౌకలకు హోర్ముజ్ జలసంధిలో రవాణా సాగించేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చింది. వాణిజ్యపరమైన రవాణాకు హోర్ముజ్‌ను ఉపయోగించుకోవచ్చంటూ ఇరాన్ విదేశాంగ మంత్రి సయీద్ అబ్బాస్ అరగ్చి తెలిపారు. 'మేం మిత్ర దేశాలుగా వేటినైతే భావిస్తున్నామో వాటికి మాత్రమే అనుమతినిచ్చాం. అందులో చైనా, రష్యా, భారత్, ఇరాక్, పాకిస్తాన్‌లు ఉన్నాయని ఆయన తెలిపారు. అదే సమయంలో ఇరాన్ శత్రు దేశాల నౌక ఒక్కటి కూడా ఈ మార్గం గుండా ముందుకు సాగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి స్పష్టం చేశారు. "ఇప్పుడు యుద్ధం జరుగుతోంది. ఇది యుద్ధ జోన్, అటువంటపుడు శత్రు దేశాలు, వాటి మిత్రుల నౌకలను పంపించే ప్రశ్నే లేదు. మిగిలిన వారికి అనుమతి వుంది." అని ఆయన పేర్కొన్నారు.

# రెండింటికీ నిధుల కోత ప్రసక్తే లేదు

ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేత తన్నీరు హరీశ్‌రావు, ఆ పార్టీ సభ్యుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్... ఆరోగ్యశ్రీ బకాయిల అంశాన్ని లేవనెత్తారు. వారి ప్రశ్నలకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిచ్చారు. ఈ దశలో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని... వైద్యారోగ్య శాఖలో ప్రభుత్వం చేపడుతున్న పలు సంస్కరణలను సోదాహరణంగా వివరించారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు వర్తించే విధంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ఇటీవలే ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. ఏదైనా కారణం చేత కుటుంబ పెద్ద చనిపోతే ప్రభుత్వం ఆ కుటుంబానికి అండగా ఉంటుందనే ధీమాను ఆ పథకం కల్పిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో ఆరోగ్యశ్రీని అమలు చేసి, అక్కడి వైద్యులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. ఆస్పత్రుల నిర్వహణ, వైద్య సేవల పర్యవేక్షణ... ఈ రెండింటి బాధ్యతలను ఒక్కరికే కాకుండా వేర్వేరు విభాగాలుగా మారుస్తామని చెప్పారు. వైద్యులను కేవలం వైద్య సేవలకే పరిమితం చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్‌వోసీ అనే విధానం కేవలం నిమ్స్‌కే పరిమితమైందని గుర్తు చేశారు. దాన్ని అన్ని బోధనాసుపత్రులతోపాటు సనత్‌నగర్, అల్వాల్ తదితర ప్రాంతాల్లోని టిమ్స్‌లకు కూడా వర్తింపజేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ వైద్య రంగంలో త్వరలో మరో పది వేల పడకలను అందుబాటులోకి తెస్తామని సీఎం చెప్పారు. తద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తామని హామీనిచ్చారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి గత బీఆర్ఎస్ హయాంలో కేటాయించిన నిధులను, ప్రస్తుత పరిస్థితితో పోల్చి సీఎం ఏకరువు పెట్టారు. గతంలో ఆ పథకానికి ప్రతినెలా రూ.52 కోట్లను ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.89 కోట్లను ఖర్చు చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఆరోగ్య శ్రీ కింద మొత్తం రూ.2,408.51 కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి ఆ పథకం బకాయిలు రూ.600 లక్షలు పేరుకు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి ఆ బకాయిలు రూ.727 కోట్లకు చేరాయని, అంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడ్డ బకాయిలు కేవలం రూ.127 కోట్లేనని స్పష్టం చేశారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు సుమారుగా రూ.496 కోట్లు, ప్రయివేటుకు రూ.231 కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతినెలా రూ.102 కోట్ల విలువైన వైద్యసేవలందిస్తే, ఇప్పుడు రూ.184 కోట్ల సేవలందుతున్నాయని చెప్పుకొచ్చారు.

# ఏఐ యుగానికి అనుగుణంగా చైనా తరగతులు

విద్యార్థులను భవిష్యత్తు అవసరాలకు సిద్ధం చేస్తోంది. అయితే ఈ విషయంలో మాత్రం భారత్ చాలా వెనుకబడి ఉంది. ఇప్పటికీ మార్కులు, ర్యాంకుల ఆధారంగా విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పాత పద్ధతి కొనసాగుతోంది. భారత్‌లోని ఈ తీరుపై మేధావులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పద్ధతి మారాల్సిన అవసరాన్ని వారు నొక్కి చెప్తున్నారు. భారత్‌తో పోలిస్తే చైనా ప్రతీ రంగంలో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. విద్యారంగంలోనూ కొత్త మార్పులు తీసుకొస్తోంది. చైనా 2021లో 'డబుల్ రిడక్షన్' పాలసీని ప్రవేశపెట్టింది. విద్యార్థులపై ట్యూషన్లు, అధిక హోంవర్క్ ఒత్తిళ్లను తగ్గించింది. ఇది సాధారణ నియంత్రణ చర్యలా కనిపించినప్పటికీ.. అసలు ఉద్దే శ్యం విద్యావిధానాన్ని పూర్తిగా మార్చడమే. ఈ విధానం తర్వాత చైనా పాఠశాలల్లో అనువర్తనాధారిత (అప్లికేషన్ బేస్డ్) అధ్యయనం పెరిగింది. కేవలం పుస్తకజ్ఞానం మాత్రమే కాకుండా ప్రయోగాత్మక నైపుణ్యాలు, సమస్యల పరిష్కారం ప్రధానాంశాలుగా మారాయి. టెక్నాలజీ వినియోగం, ప్రాజెక్ట్ ఆధారిత విద్య, భవిష్యత్తు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి వంటివి ప్రాధాన్యం పొందుతున్నాయి. చైనా ఇక టాపర్లు తయారు చేసే దేశం మాత్రేమే కాదు.. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఉన్న విద్యా ర్థులను తయారుచేసే దిశగా అడుగులు వేస్తోందని విద్యావేత్తలు, మేధావులు అంటున్నారు. దేశంలో కంఠస్థ పద్ధతిని తగ్గించి.. వాస్తవ జీవితానికి ఉపయోగపడే నైపుణ్యాలపై ఆ దేశం దృష్టి పెడుతోంది. బీజింగ్, షాంఘై వంటి నగరాల్లో విద్యార్థులు కొత్త ఆలోచనలు, సృష్టించడం వంటి విషయంలో ఉత్సాహం కనబరుస్తున్నారు.

## మార్కాపురం బస్సు ప్రమాదంపై కనిగిరి వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల తీవ్ర దిగ్భ్రాంతి




మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంపై కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్–ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్ధించారు.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని,ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## పంటకాలువల ఆధునికరణ పనులు సుప్రీం కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా జరుగుతున్నాయి..

**-బీజేపీ కార్యకర్తఇంటి ని అన్యాయం గా కూల్చారు : మిడతల రమేష్..**



**నెల్లూరు సిటీ.. మార్చ్ 26/(విజ్ఞాన్ ప్రతినిధి )** నెల్లూరు నగరంలో జరుగుతున్న పంట కాలువల ఆధునికరణ పనులు కేంద్ర జల చట్టం కు సుప్రీం కోర్టు ఆదేశాల కు పూర్తి వ్యతిరేకంగా జరుగుతున్న యని అన్నారు.. బీజేపీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ నమామిగంగే కన్వీనర్ మిడతల రమేష్..గురువారం ఇరిగేషన్ ఎస్ ఈ దేస్ నాయక్ ను కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ రామిరెడ్డి కాలువ ను ఆధునికరణ పేరుతొ కాలువ ను కుదిస్తున్నారని దీనికి జలవనరుల శాఖ డీ పీ ఆర్, కూడ లేదని ఇంతటి గోరమైన పని ఇంకోటి లేదని విమర్శలు చేశారు...అదేవిదంగా ఈ కాలువ కు తూర్పు భాగనఉన్న పట్టా భూమి లో నివసిస్తున్న ఒక పేద కుటుంబం బీజేపీ కార్యకర్త ప్రభావతి ఇంటిని మున్సిపల్ కమిషనర్ కూల్చివేయించారన్ని ఈచర్య దుర్మార్గం అన్ని అన్నారు... కమిషనర్ కనీసం కూటమి ప్రభుత్వం లో బీజేపీ ఉండనే విషయం కూడ మర్చి పోయారని ఈ విషయం లో ఇప్పటి కేహై కోర్టు స్టే ఇచ్చిన కమిషనర్ లెక్క చేయకుండా వ్యవరించారాని హైకోర్టు ఆదేశాలు దిక్కరించిన ఆయన పై దిక్కరణ కేసు నడిస్తుందని తెలిపారు...అసలు ఇరిగేషన్ కాలువ ల విషయం లో మున్సిపల్ శాఖ సంబంధం ఏమిటీ అన్ని ప్రశ్నించారు... నెల్లూరు నగరం లోని ప్రజలు విధ్వంసల పై ప్రభుత్వం తీరు నుతప్పు బడుతున్నారని పేర్కొన్నారు.. ఇరిగేషన్ లో అవినీతి పరులకు అందాలాలు.. నెల్లూరు జలవనరుల శాఖ లో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొని ఫోన్ పేద్వారా లక్షలరూపాయలు కాంట్రాక్టర్లవద్దవసూళు చేసిన గంగాధర్ రెడ్డి కీ పోస్టింగ్ ఎలా ఇస్తారని మిడతల రమేష్ నిలదీశారు అతనికి పోస్టింగ్ ఇస్తే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరా హర దీక్ష చేస్తామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమం లో పైడి మాని సుజన, చిత్తత్తురు పద్మావతి,నారాయణ యాదవ్,సునీల్ రెడ్డి, నరాల సుబ్బారెడ్డి,చిట్టి బాబూ, ప్రతిప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హేళన చేయకు!

జీవితంలో అందరినీ నువ్వు
నా వాళ్ళు అని గుడ్డిగా నమ్మకు
కొందరికి ఏమి లేకపోయినా
నమ్మకమనే వాళ్ళ పెట్టుబడిగా
తడి గుడ్డతో గొంతు కోసేయగలరు
అదే నమ్మకం అనే పేరుతో
జీవితాన్ని సంక నాకించేస్తారు.

ఇది ఒకప్పుడు మన ముత్తాతలు
తాతలు రాసిన రాతియుగం కాదు
ఇప్పుడు ఇక్కడ నడుస్తున్నదంతా
మాయదారి మనుషుల మయాలోకం
మనం రాసుకుంటున్న కలియుగం
నీ దగ్గర డబ్బులున్నాయన్న
అహంకారం ధోరణితో పొగరెక్కి
గర్వంతో ఎదుటి వారిని
చిన్నచూపుతో హేళన చేయకు
మనిషి వందేళ్లు బ్రతికినా
స్వర్గానికి కాదు కదా!
చివరికి కాటికే వెళ్ళాలి
అడ్డం దిడ్డంగా సంపాదిస్తూ
నువ్వు కోట్లు కూడా బెట్టినా
నీ కడుపు కూటికే అని తెలుసుకో!



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## ప్రమాదంలో గాయపడిన విద్యార్థి అద్దంకి మనోహర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, దారపనేని

**కనిగిరి విజ్ఞాన్ దినపత్రిక :** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పుకోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామానికి చెందిన అద్దంకి మల్లికార్జున కుమారుడు మనోహర్ హైదరాబాద్ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతూ శ్రీరామనవమి సందర్భంగా స్వగ్రామానికి ప్రైవేటు ట్రావెల్స్ లో వస్తుండగా మార్కాపురం మండలం రాయవరం దగ్గర జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలు కిమ్స్ లో చికిత్స పొందుతున్న మనోహర్ ను కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పరామర్శించారు. కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారని దారపనేని తెలిపారు. అద్దంకి మనోహర్ ను నాగినేని రమేష్ బాబు, మిరియం సుబ్బరాయుడు పరామర్శించారు.ప్రైవేట్ ట్రావెల్స్ నియమ నిబంధనలు పాటించకుండా, ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, అధికారులు ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు మాత్రం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను నామమాత్రంగా తనిఖీ చేసి ఆ తరువాత పట్టి పట్టకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రమాదం జరిగి 8 గంటలు అయినా హరికృష్ణ ట్రావెల్స్ యాజమాన్యం స్పందించకపోవడం దారుణమని, కనీసం మృతుల కుటుంబాలకు పరామర్శించిన దాఖలాలు కూడా



లేవని, హరికృష్ణ ట్రావెల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని, మృతుల కుటుంబాలకు తగిన పరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్య ధోరణితో ప్రైవేట్ ట్రావెల్స్ నడుపుతున్న హరికృష్ణ ట్రావెల్స్ బస్సు13 మంది నిండు ప్రాణాలు బలిగొన్నదనీ, ఆ కుటుంబాలో విషాదఛాయలు అలుముకున్నాయని, గత 6 నెలల్లో ఇది నాలుగో బస్సు ప్రమాదం, ఈ ఘటనల్లో దాదాపు 100 మంది ప్రాణాలు కోల్పోయారని, కఠినమైన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు ఆగుతాయని, అధికారులు అన్ని ట్రావెల్స్ బస్సులు అండ్ రవాణా సంస్థలను తనిఖీ చేయాలని, తెలుగు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు ఈ సంఘటనలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## నకాపల్లి జిల్లాతగరంపూడి గుడివాడ గురునాథ్ రావు గారి విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలి



**విజ్ఞాన పత్రిక రాంబిల్లి రిపోర్టర్ కోట్ని బాబురావు :** అనకాపల్లి జిల్లా తగరంపూడి గ్రామంలో స్వర్గీయ మాజీ మంత్రి వర్యులుశ్రీ గుడివాడ గురునాథ్ రావు గారివిగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు జిల్లా నలుమూలల నుంచి తగరంపూడి వెళ్లారు ఈ కార్యక్రమం లో మాజీ ఉ ప ముఖ్యమంత్రి రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీ బూడి ముత్యాల నాయుడు గారు, మాజీ మంత్రి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీ గుడివాడ అమర్నాథ్ , జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు , కరణం ధర్మశ్రీ ,అన్నెంరెడ్డి అదీప్ రాజు గారు, చింతలపూడి వెంకట్రామయ్య , అనకాపల్లి ఇంచార్జ్ మాలసాల భరత్ , దంతులూరి దిలీప్ కుమార్ పెన్నమరాజు సతీష్ వర్మ చిక్కాల రామారావు, శీరం నరసింహమూర్తి చింతకాయల సన్యాసి పాత్రుడు పైలా శ్రీనివాసరావు గొర్లె సూరిబాబు బొదుపు గోవిందు గండి రవికుమార్ ఏడువాక సత్య రావు దొండా రాంబాబు , ఎంపీపీ లు జడ్పీటీసీలు రాష్ట్ర జిల్లా నియోజకవర్గం మండలాల అనుబంధ విభాగాల సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో శ్రీ గాయత్రి విద్యార్థుల ప్రతిభ



నిర్వహించిన కల్పనా చావ్లా క్రియేటివ్ మైండ్స్ ఒలంపియాడ్ ప్రాజెక్ట్ నందు గూడూరు శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పలు స్టేట్ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ కల్పనా చావ్లా క్రియేటివ్ మైండ్స్ ఒలంపియాడ్ ప్రాజెక్ట్ నందు రాష్ట్రవ్యాప్తంగా 575 స్కూల్స్ పాల్గొనగా, పలు విభాగాలలో గూడూరు శ్రీ గాయత్రి విద్యార్థులు హుమేరా రాష్ట్రస్థాయిలో 2 వ ర్యాంకు, జగదీశ్వరి 4 వ ర్యాంకు, తన్వి రెడ్డి 4 వ ర్యాంకు, నాగ మనస్వి 4 వ ర్యాంకు, ఈప్సిత శ్రీ 4 వ ర్యాంకు , తేజస్వి 4 వ ర్యాంకు ,వర్ధన్ 5వ ర్యాంకు మరియు క్రితిక 5 వ ర్యాంకు, పూజిత 5 వ ర్యాంకు, తరుణ్ కుమార్ 5 వ ర్యాంకు, కేశవ దర్శిని 5 వ ర్యాంకు, వైష్ణవి 5వ ర్యాంకు మొత్తం 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి తమ సత్తా చాటాలని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులని మెడల్స్ సర్టిఫికెట్స్ తో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఐటి ఉపాధ్యాయులు సుప్రజ, రేవంతి ,ధనశ్రీ ,యామిని, హరిత,ప్రైమరీ ఇంచార్జ్ నాజీర మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కాపురం బస్సు ప్రమాదంలో అంకభూపాలపురం మహిళ మృతి

**-సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**



**కందుకూరు ( విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 26** మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి చెందిన మహిళ మృతి చెందింది. ఆమెను బండారు పద్మ (25)గా గుర్తించారు. అంక భూపాలపురం గ్రామానికి చెందిన బండారు పద్మ, బత్తుల మణెమ్మ సహా పలు కుటుంబాలు... తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా నిర్మల్ సమీపంలో స్థిరపడ్డారు. వీరంతా అక్కడ బేల్దారి పనులు చేసుకుని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో బండారు పద్మ, బత్తుల మణెమ్మ, 10 సంవత్సరాల వయసున్న బండారు రోహన్ లు సొంతూరు వెళ్లేందుకు.... బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి కనిగిరికి బస్సులో బయలుదేరారు. బస్సు ప్రమాదానికి గురై మంటలు చెలరేగాక.... బత్తుల మణెమ్మ వెంటనే స్పందించి, పక్కనే కూర్చున్న రోహన్ ను కిటికీలోనుంచి బయటకు విసిరేసింది. తరువాత మణెమ్మ కూడా ప్రమాదం నుంచి తప్పించుకుని బయటపడింది. కానీ బండారు పద్మ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమైంది. కాగా పద్మకు భర్త గోవిందరాజులు, 12 సంవత్సరాల వయసున్న కుమారుడు, పది సంవత్సరాల వయసున్న కుమార్తె ఉన్నారు. రోహన్ తల, చెవులు, ముక్కు, కాలుకు స్వల్ప గాయాలయ్యాయి. మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బత్తుల మణెమ్మ కుడి చెయ్యి విరగడంతో పాటు కిడ్నీకి తీవ్ర గాయం అయింది. ఆపరేషన్ కోసం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే వారి బంధువులందరూ మార్కాపురం చేరుకున్నారు. అలాగే గుడ్లూరు మండలం వెంకంపేట గ్రామానికి చెందిన తుపాకుల రత్తమ్మ (భర్త పోలయ్య) కూడా దుత్తలూరు వెళ్లేందుకు ఇదే బస్సులో బయలుదేరింది. అయితే ఆమె స్వల్ప గాయాలతో బయటపడింది. కాగా బత్తుల పద్మ అకాల మరణం పట్ల, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. పద్మ భర్త గోవిందరాజులతో ఫోన్లో మాట్లాడి ఓదార్చారు. అలాగే రోహన్ తల్లిదండ్రులు, మణెమ్మ, రత్తమ్మ కుటుంబ సభ్యులతో కూడా ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ముగ్గురి ఆరోగ్యం మెరుగుపడి ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చేవరకు, ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు.

## విజేత స్కూల్లో "ముందస్తు శ్రీరామనవమి వేడుకలు

**విజ్ఞానపత్రికరిపోర్టర్పొదలకూరు**



పొదలకూరుపట్టణంలోని విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తు శ్రీరామనవమి వేడుకలు గణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ +.కామాక్షి మాట్లాడుతూ "శ్రీరామనవమి" అనగా సాక్షాత్తు విష్ణుమూర్తి ఏడవ అవతార మూర్తుడైన శ్రీరాముని జన్మదినం అని ఆమె తెలిపారు. అదేవిధంగా ఆ "శ్రీరాముడు" ఆదర్శ పురుషుడని, ధర్మానికి మరియు నీతికి నిదర్శనం అని కూడా చెప్పారు. ఈ రోజున సీతారాముల కళ్యాణం జరపడం మరియు వీక్షించడం వల్ల కుటుంబంలో సంతోషం, శాంతి కలుగుతుందని కూడా తెలియజేశారు. ఈ రోజున మనం అనేక విధాలుగా చెప్పుకోవచ్చు అని అనగా రాముడి జననం, మరియు సీతారాముల కళ్యాణం మరియు రాముడు అయోధ్యకు తిరిగివచ్చి పట్టాభిషిక్తుడైన రోజుగా కూడా భావిస్తారని మరియు "శ్రీరామనవమి" రోజున ఉపవాసం, పూజలు, రామాయణ పారాయణం చేయడం వల్ల అడ్డంకులు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని ఆమె ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులకు మరియు విద్యార్థినీ,విద్యార్థులకు తెలియపరిచారు. విజేత స్కూల్లో ఈ చైత్రమాసంలో వచ్చే ఎండలను తట్టుకోవటానికి శరీరానికి చలువ చేసే వడపప్పు మరియు పానకంనుమరియు గుగ్గిళ్లను ఆ దేవునికి నైవేద్యంగా సమర్పించి పిల్లలందరికీ పంచి పెట్టడం జరిగింది. అలాగే తమలపాకులలో "శ్రీరామ" అనే నామం రాసి ఈ కార్యక్రమాన్ని మరింత మెరుగుపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ +. కామాక్షి గారు మరియు విద్యార్థినీ,విద్యార్థులు మరియు ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది

## వీ.ఆర్.ఎం.సి.హెచ్ పాఠశాలలో శ్రీరామ నవమి వేడుకలు



వీ.ఆర్.ఎం.సి.హెచ్ పాఠశాలలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీరాముని జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేడుకలు ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బాలికలు పట్టు పావడాలలో అందంగా మెరిసిపోగా, బాలురు ధోతి శైలిలో సాంప్రదాయంగా కనిపించారు. విద్యార్థులు దేవుడికి పండ్లు, పూలు సమర్పించి భక్తిని వ్యక్తం చేశారు. శ్రీరామ నవమి ప్రాముఖ్యతను శ్రీరాముడు పాటించిన సత్యం, ధర్మం, న్యాయం వంటి విలువలను విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు రామాయణంలోని సంఘటనలను ఆధారంగా చేసుకొని పాటలు, నాటికలు ప్రదర్శించారు. ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. ఈకార్యక్రమం హెచ్.ఎం.వెంకటరావు ఇన్చార్జ్ హెచ్.ఎం లక్ష్మీనారాయణ పీ.ఎస్. హెచ్.ఎం. చంద్రకళ, వైస్ ప్రిన్సిపల్ హరిత, జయలక్ష్మి, పీ.డీ గురు ప్రసాద్ ఏ.ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో అత్యంత అద్భుతంగా నిర్వహించబడింది. ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. చివరగా ప్రసాదం పంపిణీతో కార్యక్రమం ముగిసింది. ఈవేడుక ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహనతో పాటు నైతిక విలువలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఆత్మకూరులో మంత్రి ఆనంచే నూతన వేద రెస్టారెంట్ ప్రారంభం



దివంగత కూరగాయల శ్రీనయ్య కలలసౌధం వారి కుమారుల సారధ్యంలో ఆత్మకూరు నుండి నెల్లూరు పాలెం కు వెళ్లే రహదారిపై నేటి నుండి ప్రారంభమైన వేదఫ్యామిలీ రెస్టారెంట్.. రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారి సువర్ణ హస్తాలతో ప్రారంభించబడి నేటి నుండి పూర్తిస్థాయిలో కస్టమర్లకు మెచ్చే భోజనప్రియులకు నచ్చే విధంగా ప్రారంభమైన వేద రెస్టారెంట్ కు విచ్చేసి మా వ్యాపార అభివృద్ధికి సహకరించగలరని రెస్టారెంట్ నిర్వాహకులు కోరుచున్నారు...

## శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 26** శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని స్మరించుకుంటూ జరుపుకునే శ్రీరామనవమి పండుగ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ధర్మం, న్యాయం, అంకితభావంతో పనిచేసే నాయకత్వం... ఇవన్నీ శ్రీరాముని జీవితం మనకు నేర్పిన గొప్ప సందేశాలు. ప్రతి ఒక్కరి జీవితంలో ధర్మం నిలవాలి. ప్రతి ఇంట్లో ఆనందం వెలగాలి. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి – ఇదే మన సంకల్పం కావాలి. శ్రీరాముని ఆదర్శాలు మనకు మార్గదర్శకం కావాలి. సీతా సమేత కోదండరాముడి కరుణా కటాక్షాలు మీ అందరిపై ఉండాలని, పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ, శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన ఇంటూరి నాగేశ్వరరావు

## జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పి డా. అజిత వేజెండ్ల, ఐ.పి.ఎస్



జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బంది మరియు మీడియా మిత్రులకు జిల్లా ఎస్పి డా. అజిత వేజెండ్ల, ఐ.పి.ఎస్ గురువారం ఒక ప్రకటనలో శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ధర్మానికి, న్యాయానికి ప్రతీక అని, ఈ పండుగ మనకు ధర్మాన్ని ఎలా ఆచరించాలో సందేశం ఇస్తుందని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో, చలువ పందిళ్ల మధ్య శ్రీరామనవమి వేడుకలను ప్రజలందరూ అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రధాన రామాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు...

## మత్స్యకారుల సమస్యలపై పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు జువ్వలదిన్నె తీర ప్రాంతానికి త్వరలో రానున్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి



**బోగోలు : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ )** మత్స్యకారుల హక్కులు, వారి జీవనోపాధికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఈ పర్యటన చేపట్టనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. జువ్వలదిన్నె వద్ద మత్స్యకారుల కోసం నిర్మించాల్సిన చేపల నౌకాశ్రయం కోసం ప్రభుత్వం 70 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, అందులో 29 ఎకరాలను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించడం సరికాదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారుల కోసం కేటాయించిన భూమిలో భాగాన్ని ప్రైవేట్ సంస్థకు ఇవ్వడం ద్వారా వారి హక్కులు దెబ్బతింటాయని వారు అంటున్నారు. అలాగే సముద్ర సంపదను అక్రమంగా దోచుకుపోతున్న తమిళనాడుకు చెందిన పడవలను ఎనిమిది నెలల క్రితం నిర్బంధించినప్పటికీ, తరువాత వాటిని వదిలేయడం వెనుక ఎవరి హస్తం ఉందో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ విషయంపై మత్స్యకారులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. జగన్ పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలికాప్టర్ దిగే స్థలాన్ని కావలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తలసిల రఘురామ్ , జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాకాని గోవర్ధన్ రెడ్డి కలిసి పరిశీలించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కామారి శ్రీనివాసులుకు నివాళులర్పించిన బీసీ నాయకులు..!



**నెల్లూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ :** కావలి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా కొమారి శ్రీనివాసులు అనేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని బీసీల ఉనికిని చాటడంలో కీలకపాత్ర పోషించారు. కావలి పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం మొట్టమొదట స్థాపించి దానిలో చురుకుగా పాల్గొన్న బీసీ సీనియర్ మత్స్యకార నాయకులు కొమారి శ్రీనివాసులు ఉత్తర క్రియలు గురువారం కావలి మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో వారి నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా బిసి ఐక్యత భవన్ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్ రావు, బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఉరిటి గోవిందు, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద రావు, బీసీ ఐక్యత భవన్ సీనియర్ అడ్వకేట్ సాయి ప్రసాద్, కుమ్మర సంఘం కావలి ఇన్చార్జ్ బెజవాడ అభిసాగర్ ప్రజాపతి మాట్లాడుతూ కావలి పట్టణంలో రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా బీసీలు ఎదగాలనే ఉద్దేశంతో బీసీ సంక్షేమ సంఘంను ఏర్పాటు చేసి బీసీల ఉనికి చాటేందుకు ఆయన చేసిన కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట సీనియర్ నాయకులు కొమారి రాజు, బీసీ ఐక్యత భవన్ సీనియర్ అడ్వకేట్ ఐ సాయిప్రసాద్, బిసి ఐక్యత భవన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఉరిటి గోవిందు, బీసీ ఐక్యత భవన్ అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి చిన్ని వర ప్రసాద్ రావు, కావలి కుమ్మర సంఘం ఇన్చార్జి బెజవాడ అభిసాగర్ ప్రజాపతి బీసీ నాయకులు పాల్గొన్నారు.

## మార్కాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ మార్చి 26** మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు సజీవదహనం కావడం తీవ్రంగా కలచివేసిందని ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ తెలిపారు. టిప్పర్ మరియు ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు దుర్మరణం చెందడం ఎంతో బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్యసాయం అందేలా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ ప్రమాదంలో సుమారు పది మందికి పైగా ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన వారు ఉన్నట్లు తెలిసిందని, కానీ వారికి ప్రాణపాయ స్థితిలో లేరని, వారిలో 9 మంది గాయాల పాలయ్యారని, ఒకరి ఆచూకీ ఇంకా తెలియలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## కోవూరు నియోజకవర్గ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కోవూరు నియోజ కవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సీతారాముల కళ్యాణం ఎంతో పవిత్రమైన శుభదినం అన్నారు. శ్రీరామచంద్రుల వారు ధర్మానికి ప్రతి రూపమైన ఆదర్శ పురుషుడని సీతారాముల కృపా కటాక్షాలతో కోవూరు నియోజకవర్గ ప్రజానీకం అంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కోవూరు నియోజకవర్గంలో ?ప్రతి ఇల్లు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో వుండాలని కోరారు. శ్రీరాముల వారి ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తి కావాలని పేర్కొన్నారు. ?నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు.

## జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు డా॥ కిషోర్స్ రత్నం విద్యార్థులు ఎంపిక



ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు ఇటీవల నూజివీడు, విజయవాడ జిల్లాలో నిర్వహించిన ఆర్చరీ పోటీలలో డా॥కిషోర్స్ రోషిణి రత్నం హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని కె. మోక్ష ఇండియన్ బో, ఏడవ తరగతి విద్యార్థిని పి. భావజ్ఞ హంసిని రికర్వ్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొంది, 27, 28 తేదీలలో గుంటూరు జిల్లా నంబూరులో నిర్వహించు మినీ నేషనల్ లో పాల్గొనడానికి అర్హత సాధించారు. డా॥కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లుడా॥ కృష్ణకిషోర్గారు, వాసంతీ విద్యార్థులను అభినందిస్తూ వారు మరెన్నో ఉన్నత శిఖరాలను చేరాలని ఆశించారు. ఈ సందర్భంగా డా॥కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, విద్యార్థులను పుష్పగుచ్ఛముతో అభినందించి ప్రశంశించారు. ఆయన మాట్లాడుతూ్యా యాక్టివిటీస్ ద్వారా విద్యార్థులకు టెబుల్ టెన్నిస్, షటిల్, ఆర్చరీ, చెస్ మొదలైన క్రీడలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుతున్నది. ప్రతి సంవత్సరం ్యా విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎంపికవ్వడం ఎంతో సంతోషమని తెలియజేసారు. ఈ కార్యక్రమములో డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి ద్వారా 5 లక్షల ప్రమాద భీమా చెక్కు అందజేత..!

### -ప్రమాద బీమాను బాధిత కుటుంబానికి అందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**వింజమూరు మార్చి 25**



కలిగిరి మండలం, కావలి ముస్తాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త తరిమెర్ల శ్రీనివాసులు గత కొన్ని నెలల క్రితం జరిగిన దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరం. ఈ విషాద ఘటనను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో, ప్రభుత్వం ద్వారా మంజూరైన 5 లక్షల రూపాయల ప్రమాద భీమా సహాయాన్ని శ్రీనివాసులు గారి భార్య తరిమెర్ల ఓబులమ్మ కి మరియు వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు కష్టసమయంలో ఉన్నప్పుడు వారిని ఆదుకోవడం తెలుగుదేశం పార్టీ విధిగా భావిస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలు పార్టీకి అండగా నిలిస్తే, పార్టీ కూడా వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సంఘటన, కార్యకర్తల పట్ల పార్టీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన అన్నారు. అలాగే, బాధిత కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. శ్రీనివాసులు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోవడం తమకు తీరని లోటని భావోద్వేగంతో తెలిపారు. అయితే ఇలాంటి క్లిష్ట సమయంలో తమను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన తెలుగుదేశం పార్టీకి, ముఖ్యంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## హార్ట్ ఫెయిల్యూర్ నిర్వహణలో తాజా అభివృద్ధులు

### -డాక్టర్ జయరామ్ మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు

హార్ట్ ఫెయిల్యూర్ అనేది గుండె శక్తి తగ్గిపోవడం వల్ల శరీరానికి అవసరమైన రక్తాన్ని సరైన విధంగా పంపించలేని స్థితి. ఇది ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా మారిందని మెడికల్ హాస్పిటల్ డాక్టర్ జయరామ్ తెలియజేశారు. ముఖ్యంగా డయాబెటిస్, హైపర్‌టెన్షన్ మరియు జీవనశైలి మార్పుల వల్ల దీని ప్రబలత పెరుగుతోంది. అయితే, గత కొన్ని సంవత్సరాలలో హార్ట్ ఫెయిల్యూర్ నిర్ధారణ మరియు చికిత్సలో గణనీయమైన అభివృద్ధులు చోటుచేసుకున్నాయి. ఇటీవలి కాలంలో ఔషధ చికిత్సలో జరిగిన మార్పులు హార్ట్ ఫెయిల్యూర్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా వంటి మందులు రోగులలో మరణాల రేటును తగ్గించడమే కాకుండా, హాస్పిటల్ అడ్మిషన్లను కూడా తగ్గిస్తున్నాయి. ఈ మందులు ఇప్పుడు హార్ట్ ఫెయిల్యూర్ చికిత్సలో స్టాండర్డ్ థెరపీగా మారుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) వినియోగం కూడా కార్డియాలజీలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తోంది. ఎకోకార్డియోగ్రఫీ ద్వారా గుండె పనితీరును ఆటోమేటిక్‌గా విశ్లేషించడం, రోగి ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేయడం వంటి అంశాలలో ూ× కీలకంగా మారుతోంది. దీనివల్ల హార్ట్ ఫెయిల్యూర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం సాధ్యమవుతోంది అని తెలిపారు. రిమోట్ మానిటరింగ్ మరియు టెలీమెడిసిన్ వినియోగం కూడా పెరుగుతోంది. వేరబుల్ డివైసులు మరియు ఇంప్లాంటబుల్ సెన్సార్ల ద్వారా రోగి గుండె పరిస్థితిని నిరంతరం పరిశీలించడం సాధ్యమవుతోంది. దీనివల్ల సమస్యలు ముందుగానే గుర్తించి చికిత్స అందించడం వల్ల హాస్పిటల్ రీ–అడ్మిషన్ రేటు తగ్గుతోంది. పర్సనలైజ్డ్ మెడిసిన్ కూడా హార్ట్ ఫెయిల్యూర్ నిర్వహణలో ఒక ముఖ్యమైన దిశగా అభివృద్ధి చెందుతోంది. జెనెటిక్ టెస్టింగ్ మరియు బయోమార్కర్ల ఆధారంగా ప్రతి రోగికి ప్రత్యేకంగా చికిత్సను రూపొందించడం వల్ల చికిత్స ఫలితాలు మెరుగుపడుతున్నాయి.



ఇది భవిష్యత్తులో హార్ట్ ఫెయిల్యూర్ కేర్‌లో ప్రధాన పాత్ర పోషించనుంది. అదేవిధంగా, స్టెమ్ సెల్ థెరపీ మరియు రీజెనరేటివ్ మెడిసిన్ రంగంలో జరుగుతున్న పరిశోధనలు గుండె కణజాలాన్ని పునరుద్ధరించేందుకు కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి. ఇంకా ఈ విధానాలు పూర్తిగా సాధారణ ప్రాక్టీస్‌లోకి రాకపోయినా, భవిష్యత్తులో ఇవి గేమ్ చేంజర్‌గా మారే అవకాశం ఉంది. తీవ్రమైన హార్ట్ ఫెయిల్యూర్ కేసుల్లో అడ్వాన్స్‌డ్ డివైస్ థెరపీలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. డివైసులు రోగుల జీవనకాలాన్ని పెంచడంలో సహాయపడుతున్నాయి మరియు తీవ్రమైన కేసుల్లో ప్రాణాలను కాపాడుతున్నాయి. మొత్తానికి, హార్ట్ ఫెయిల్యూర్ నిర్వహణలో జరిగిన ఈ అభివృద్ధులు వైద్యరంగంలో ఒక కొత్త దశను ప్రారంభించాయి. ఆధునిక ఔషధాలు, సాంకేతికత మరియు వ్యక్తిగతీకరించిన చికిత్సల సమన్వయం ద్వారా రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడం సాధ్యమవుతోంది. భవిష్యత్తులో ఈ అభివృద్ధులు మరింత విస్తరించి హార్ట్ ఫెయిల్యూర్‌ను సమర్థవంతంగా నియంత్రించే దిశగా దోహదపడతాయి అని ఆయన అన్నారు.

## యశ్వంత్ కుటుంబ సభ్యులను పరామర్శించినతెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి రవీంద్ర నాయుడు



**విజ్ఞాన్ దినపత్రిక కావలి రిపోర్టర్** ఇటీవల సున్నపుట్టి చెరువులోపడి మరణించిన బెల్లంకొండ శీనమ్మ కుమారుడు యశ్వంత్ కుటుంబ సభ్యులను ఈరోజు దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి రవీంద్ర నాయుడు పరామర్శించడం జరిగింది. అతని తల్లి శీనమ్మతో మాట్లాడి ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వీరితోపాటు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కంచర్ల కృష్ణ, నగళ్ళ సుధాకర్, వల్లపు మల్లికార్జున, వెంకటరమణమ్మ, ఉమ తదితరులు ఉన్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.